క్లుప్తంగా

కూటమి వైఫల్యాలను ఎండగట్టాలి



మోరిపోడులో నూతన కమిటీ సభ్యులతో సూర్యారావు

సఖినేటిపల్లి: గ్రామ స్థాయిలో పార్టీ కమిటీలు కూటమి వైఫల్యాలను ఎండగట్టే విధంగా ప్రజల్లో చైతన్యం తీసుకురావాలని వైఎస్సార్ సీపీ నియోజకవర్గ ఇన్‌ఛార్జ్, మాజీ మంత్రి గొల్లపల్లి సూర్యారావు హితవు పలికారు. శనివారం మోరిపోడులో ఆ పార్టీ గ్రామ నూతన కమిటీని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా గెద్దం శుభాకర్, కమిటీ కార్యవర్గ సభ్యులుగా పెమ్మాడి నాగేశ్వరరావు, ఆకుల నానాజీ, చెల్లుబోయిన సుబ్రహ్మణ్యంశెట్టి, గెద్దం ప్రదీప్, కర్రి శ్రీను, కానేటి బైసన్, జి.రాజీవ్, వై.యాకోబురాజును ఎన్నుకున్నారు. కమిటీ సభ్యులను గొల్లపల్లి అభినందించారు. మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వెంకన్న సన్నిధిలో యజ్ఞ పారాయణం

అంబాజీపేట: స్థానిక కొర్లపాటివారిపాలెంలో ఉన్న భూసమేత వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో మహిళలతో యజ్ఞ పారాయణం శనివారం రాత్రి నిర్వహించారు. అమలాపురం ఎర్రవంతెన వద్ద ఉన్న శ్రీవేద మాత గాయత్రీ దివ్య భవ్యసాధన మందిరం ఆధ్వర్యంలో కోనసీమ వ్యాప్తంగా 60 గ్రామాల్లో వెయ్యి మందితో ఈ పారాయణనాన్ని ఆచరింప చేయడమే లక్ష్యమని నిర్వాహకులు చెప్పారు. భవ్య మందిరానికి రామనందస్వామి ఆధ్వర్యంలో తాము ఇప్పటివరకు 890 మంది మహిళలతో యజ్ఞ పారాయణను పూర్తిచేసామని శ్రీదేవి వివరించారు. రానున్న 10 రోజుల్లో దీప యజ్ఞాన్ని పూర్తి చేస్తామన్నారు.

బీఎస్ఎన్ఎల్ విస్తరణపై హర్షం

మలికిపురం: బీఎస్ఎన్ఎల్ నెట్ వర్క్ విస్తరణ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.47 వేల కోట్లు ఆర్థిక సాయం ప్రకటించడం పట్ల జిల్లా టెలికం సలహా సంఘం మాజీ సభ్యులు రుద్రరాజు గోపాలకృష్ణం రాజు హర్షం వ్యక్తం చేశారు. శనివారం లక్కవరంలో విలేకరులతో మాట్లాడుతూ, ప్రస్తుతం బీఎస్ఎన్ఎల్ నెటవ్‌ర్క్ సరిగా పనిచేయకపోవడం వల్ల ఖాతాదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 4జీ, 5జీ పూర్తిస్థాయిలో పనిచేసేందుకు మరిన్ని సెల్ టవర్లు ఏర్పాటు చేసి ఖాతాదారులకు మెరుగైన సేవలు అందించాలని కోరారు.

అనాథలకు అన్నదానం

కొత్తపేట: స్థానిక గోగివారిపేటకు చెందిన రిటైర్డ్ పీఈటీ, వైఎస్సార్ సీపీ నాయకుడు కొంబత్తుల విష్ణుమూర్తి పేరిట ఆయన కుటుంబీకులు అనాథలకు అన్నదానం నిర్వహించారు. విష్ణుమూర్తితో పాటు ఆయన భార్య మంగమ్మ వైఎస్సార్ సీపీ ఆవిర్భావం నుంచి పార్టీకి సేవలందించారు. ఏటా వివిధ సందర్భాల్లో పేదలకు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. 2020లో విష్ణుమూర్తి మృతి చెందారు. ఆయన భార్య, మండల పార్టీ మహిళా విభాగం మాజీ అధ్యక్షురాలు మంగమ్మ తన భర్త విష్ణుమూర్తి జయంతి, వర్ధంతి సందర్భంగా వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. విష్ణుమూర్తి వర్ధంతిని పురస్కరించుకుని బొమ్మూరు గుడ్‌విల్ అనాధ ఆశ్రమంలో 30 మందికి భోజనం ఏర్పాటుచేసి, బ్రెడ్స్, దుప్పట్లు పంపిణీ చేసినట్టు శనివారం కొత్తపేటలో విలేకరులకు తెలిపారు.

టీవీ, ఫ్యాన్లు అందజేత

మామిడికుదురు: ఈదరాడలోని సిద్ధార్థపేట ప్రాథమిక పాఠశాలకు వ్యవసాయ శాఖ అడిషనల్ డిస్ట్రిక్ట్ ప్రాజెక్ట్ మేనేజర్‌గా పని చేస్తున్న ముంగండ సత్యనారాయణ శనివారం స్మార్ట్ టీవీ బహూకరించారు. టీవీని సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి చేతుల మీదుగా హెచ్‌ఎం శిరిగినీడి శ్రీరామకృష్ణకు అందించారు. ఎస్ఎంసీ చైర్మన్ కుసుమ ప్రసాద్, స్థానికులు పాల్గొన్నారు. లూటుకుర్రు పీహెచ్‌సీకి భాస్కరరావు, సీత, నవీన్, ప్రశాంతి దంపతులు రెండు ఫ్యాన్లు అందించారు. వీటిని డాక్టర్ సత్యవతికి అందజేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కశిరెడ్డి అంజిబాబు, పీహెచ్‌సీ ఉద్యోగులు పాల్గొన్నారు.

అలీ అస్గర్‌కు కన్నీటి నివాళి

మామిడికుదురు: ముస్లింల ఆరాధ్య దైవం హజరత్ ఇమామ్ హుస్సేన్ తనయుడు అలీ అస్గర్‌కు శనివారం ముస్లింలు కన్నీటితో నివాళులర్పించారు. అర్బయీన్ కార్యక్రమాల్లో భాగంగా అలీ అస్గర్ ఊయలను గ్రామ పురవీధుల్లో ఊరేగించారు. నగరం పెద పంజీషా నుంచి మంజిలే కర్బలా వరకు ఈ ఊరేగింపు జరిగింది. అధిక సంఖ్యలో మహిళలు ఈ కార్యక్రమాల్లో పాల్గొని ఆరు నెలల పసికందు అలీ అస్గర్‌ను హతమార్చిన సంఘటనలను స్మరించుకుని కన్నీటి పర్యంతమయ్యారు. గురుహే తాజ్‌దారే పురాత్ భక్త బృందం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమాల్లో మత ప్రబోధకులు అబుల్ హసన్ నఖ్వీ మజ్లిస్ ఆలపించారు. భారీ సంఖ్యలో ముస్లింలు ఊయల ఊరేగింపులో పాల్గొన్నారు.

హెచ్‌ఎంకు సత్కారం

పి.గన్నవరం: మానేపల్లి శివారు శివాయలంక ప్రాథమిక పాఠశాలలో ఏడేళ్లుగా పనిచేస్తున్న హెచ్‌ఎం చిక్కం రవికుమార్‌ను గ్రామస్తులు, ఎస్ఎంసీ సభ్యులు ఘనంగా సత్కరించారు. పాఠశాల అభివృద్ధికి ఆయన అందించిన సేవలను పలువురు కొనియాడారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ ఎస్.రాజు, వై.రామ్మోహన్ రావు, పి.అశోక్, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

డొక్కలెండుతున్నాయ్..!

- కొబ్బరి డొక్క కొనుగోలు చేయని పరిస్థితి
- క్రమంగా తగ్గిన పీచు మిల్లులు
- డొక్కల్ని కాల్చేస్తున్న రైతులు



పెదపట్నంలంకలో కొండలను తలపిస్తున్న డొక్కల రాశులు



డొక్కలు కాలుస్తున్న రైతులు

మామిడికుదురు: కొబ్బరి ధర పెరిగిందని ఆనందపడాలో లేక కొబ్బరి డొక్క కొనే దిక్కులేదని బాధపడాలో తెలియని అయోమయ పరిస్థితుల్లో కొబ్బరి రైతులు తల్లడిల్లుతున్నారు. డొక్క కొనే దిక్కులేక దాన్ని రాశులుగా పోసి నిప్పు పెడుతున్నారు. మామిడికుదురు మండల పరిధిలో గత ఆరు నెలలుగా ఇదే పరిస్థితి ఉంది. డొక్క కొనుగోలు చేయకపోవడంతో ఎక్కడికక్కడ కొండల్ని తలపించే విధంగా డొక్కల రాశులు పెరిగిపోతున్నాయి. గతంలో కొబ్బరి డొక్కను వంట చెరుకుగా వినియోగించుకునే వారు. వ్యాపారులు పోటీ పడి డొక్కను కొని దాని నుంచి కొబ్బరి పీచు తయారు చేసేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. గ్యాస్ వినియోగం పెరిగిన తర్వాత ఎక్కడో 10 శాతం మంది కూడా పొయ్యి వెలిగించడం లేదు. దీంతో డొక్కల పరిస్థితి ఎందుకూ పనికి రాని వస్తువుగా మారింది. డొక్క పీచు తయారు చేసే పరిశ్రమల సంఖ్య గణనీయంగా తగ్గిపోవడమే వీటికి మార్కెట్ లేకపోవడానికి ప్రధాన కారణమని అటు రైతులు, ఇటు వ్యాపారులు పేర్కొంటున్నారు.

పీచు మిల్లులు నాడు 85.. నేడు 10

నగరం దీవిగా పిలవబడే మామిడికుదురు, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి మండలాల్లో గతంలో సుమారు 85 వరకు కొబ్బరి పీచు మిల్లులు ఉండేవి. ప్రస్తుతం వాటి సంఖ్య పదికి పడిపోయింది. రైతుల నుంచి కొబ్బరి డొక్కలను కొనుగోలు చేసి పీచు మిల్లులకు తరలించి వాటి నుంచి పీచు తయారు చేసే వారు. ఈ వ్యాపారం అంతగా లాభసాటిగా లేకపోవడంతో క్రమేపీ పీచు మిల్లులు మూత పడుతున్నాయి. వీటిని ప్రోత్సహించే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏ విధమైన చర్యలు తీసుకోవట్లేదని అటు వ్యాపారులు, ఇటు రైతులు వాపోతున్నారు. ఈ పరిణామాలు రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్నాయి. కొబ్బరి డొక్కలు కొనే అవకాశం లేక అవస్థలు పడుతున్నారు. ఉచితంగా ఇస్తామన్నా తీసుకెళ్లట్లేదని చెబుతున్నారు. ఎదురు సొమ్ములు ఇచ్చి మరీ డొక్కల బెడదను వదిలించుకుంటున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిలో మార్పు వచ్చే దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు.

డొక్కల్ని తగలబెడుతున్నాం



నాకు పదెకరాల కొబ్బరి తోట ఉంది. ఆరు నెలల నుంచి కొబ్బరి డొక్కలను రాశులుగా వేసి అంటించాల్సిన పరిస్థితి ఏర్పడింది. గతంలో డొక్కలను పీచు ఫ్యాక్టరీల యజమానులు కొనుక్కొని తీసుకెళ్లేవారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. కనీసం డొక్కల రాశుల వైపు ఎవ్వరూ కన్నెత్తి కూడా చూడటం లేదు. గతంలో ఎప్పుడూ ఈ పరిస్థితి ఉండేది కాదు. కొబ్బరి డొక్కలకు మార్కెటింగ్ సదుపాయం కల్పించి రైతుల్ని ఆదుకోవాలి.

– గుడిమెట్ల రాంబాబు, రైతు, అప్పనపల్లి.

డబ్బులు ఇస్తామన్న తీసుకెళ్లట్లేదు



డొక్కలు కొనుక్కొని తీసుకు వెళ్లడం కాదు. వాటిని తీసుకెళ్లినందుకు తిరిగి డబ్బులు ఇస్తామన్నా తీసుకెళ్లట్లేదు. డొక్కల పరిస్థితి ఆ విధంగా తయారైంది. పీచు ఫ్యాక్టరీలు మూతపడటమే దీనికి కారణం. ఈ పరిస్థితిలో మార్పు రావాలి. పీచు పరిశ్రమలను ప్రభుత్వం ప్రోత్సహించాలి. ఆ దిశగా చర్యలు చేపడితే కొబ్బరి డొక్కకు పూర్వ వైభవం వస్తుంది. దీనిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలోచన చేసి కొబ్బరి రైతులకు అండగా నిలవాలి.

– కొమ్ముల గోపీ, రైతు, పెదపట్నంలంక.

రైతుల ఆమరణ దీక్ష



పోతవరంలో ఆమరణ, రిలే దీక్ష చేపట్టిన రైతులు

పి.గన్నవరం: పోతవరం ముగ్గుబట్టి పరిసర ప్రాంతాల్లో 160 ఎకరాల విస్తీర్ణంలోని వరిచేలకు కొన్నేళ్లుగా ఏర్పడిన ముంపునీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆ ప్రాంత రైతులు శనివారం ఆమరణ, రిలే దీక్షలు చేపట్టారు. కొద్దిపాటి వర్షానికే వరిచేలు నీట మునిగి తీవ్రంగా నష్టపోతున్నా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పోతవరం ముగ్గుబట్టి వద్ద డ్రైన్‌లో సుమారు ఆరు తూరలు మట్టితో పూడుకుపోవడంతో వరి చేలలోని ముంపునీరు దిగట్లేదని రైతులు వివరించారు. ఈ కారణంగా కొద్దిపాటి వర్షాలకే వరిచేలు మునిగిపోతున్నాయని వివరించారు. చేలు పూర్తిగా మునిగిన పుడల్లా తాము సొంత ఖర్చులతో పూడిక తొలగించుకుంటున్నట్టు వివరించారు. సమస్యను పరిష్కరించాలని గత నాలుగేళ్లుగా అధికారుల చుట్టూ తిరుగుతున్నా, వారు పట్టించుకోవట్లేదన్నారు. జిల్లా స్థాయి అధికారులకు విన్నవించినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. ఇటీవల కురిసిన వర్షానికి చేలన్నీ నీట మునిగాయని, దీంతో వరినాట్లు కుళ్లిపోతున్నాయని రైతులు ఆవేదన చెందారు. గత్యంతరం లేని స్థితిలో దీక్ష చేపట్టినట్టు రైతులు, కౌలు రైతులు వివరించారు. తక్షణమే తూముల్లో పూడిక తొలగించాలని నినాదాలు చేశారు. రైతు నాయకుడు పినిశెట్టి వెంకటేశ్వరరావు ఆమరణ దీక్ష చేపట్టగా.. పలువురు దీక్షితులు రిలే దీక్షల్లో పాల్గొన్నారు. వీరికి పలువురు నాయకులు మద్దతు పలికారు.

రైతుల దీక్షల ఉపసంహరణ

ముంపు నీటి సమస్య పరిష్కారం కోరుతూ పోతవరంలో రైతులు చేపట్టిన దీక్షా శిబిరాన్ని ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ శనివారం సాయంత్రం సందర్శించి, రైతుల సమస్యను తెలుసుకున్నారు. డ్రెయిన్‌లో పూడిక తొలగించాలని అధికారులను ఆయన ఆదేశించారు. జేసీబీతో తాత్కాలికంగా పూడిక తొలగింపు పనులను ప్రారంభించారు. దీంతో రైతులు తమ దీక్షలను విరమించారు.

దైవదర్శనాలకు స్త్రీ శక్తి వర్తించదా?



చింతనలంకలో కరపత్రాలు ఆవిష్కరించిన శ్రీనివాసరావు, నాయకులు

అయినవిల్లి: సీఎం చంద్రబాబు మోసలను రాష్ట్ర ప్రజలు త్వరలోనే ఎండగడతారని, మహిళలకు ఉచిత బస్సు ప్రారంభించి రెండు రోజులు కాకుండానే దైవ దర్శనాలకు వెళ్లిన మహిళలకు స్త్రీ శక్తి వర్తించదని, ప్రత్యేక బస్సుల పేరుతో టిక్కెట్లు వసూళ్లు చేయడంపై వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కో–ఆర్డినేటర్ గన్నవరపు శ్రీనివాసరావు మండిపడ్డారు. శనివారం చింతనలంక, వెలువలపల్లి, ఎస్.మూలపాలెం గ్రామాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు మేడిశెట్టి శ్రీనివాస్ ఆధ్వర్యంలో బాబు ష్యూరిటీ–మోసం గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని ఇంటింటికీ వెళ్లి ఏడాదిలో ప్రజలకు కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. మహిళలకు ఉచిత బస్సు పేరుతో బురిడి కొట్టించారన్నారు. వాడపల్లి వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం బస్సులు ఎక్కిన మహిళల వద్ద టిక్కెట్లకు సొమ్ములు వసూలు చేయడంపై మండిపడ్డారు. కార్యక్రమంలో విళ్ల శ్రీను, వస్కా కోటేశ్వరావు, షరాబు, జిల్లా ఉపాధ్యక్షుడు విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి ప్రదాత వాజ్‌పేయి



బి.దొడ్డవరంలో వాజ్‌పేయికి నేతల నివాళి

మామిడికుదురు: భారత మాజీ ప్రధాని, స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయి స్ఫూర్తి ప్రదాత అని బీజేపీ నేతలు శ్లాఘించారు. వాజ్‌పేయి వర్ధంతిని బి.దొడ్డవరం, గ్రామాల్లో శనివారం నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమాల్లో పార్టీ మండల శాఖ అధ్యక్షుడు బైరిశెట్టి రామకృష్ణ, నేతలు పెద్దిరెడ్డి శ్రీనివాసరావు, పసుపులేటి మహలక్ష్మీరావు, నక్కా త్రిలోచనరావు, వేగి వెంకటేశ్వరరావు, కటికిరెడ్డి తమ్మయ్య నాయుడు, బైరిశెట్టి వెంకటేశ్వరరావు, యాండ్ర అబ్బాస్ పాల్గొన్నారు.

వాజ్‌పేయి వర్ధంతి

రాజోలు: భారత మాజీ ప్రధాని, భారతరత్న అటల్ బిహారి వాజ్‌పేయి వర్ధంతిని శనివారం రాజోలులో బీజేపీ నాయకులు నిర్వహించారు. స్థానిక ఇరిగేషన్ కార్యాలయం కాటన్ విగ్రహం వద్ద వాజ్‌పేయి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. జిల్లా బీజేపీ ఉపాధ్యక్షుడు చెల్లింగి త్రినాథ్, నాయకులు వడ్లమూడి ప్రకాశరావు, దేవళ్ల మాణిక్యాలరావు, జొన్నలగడ్డ గోపాలకృష్ణ, మొల్లేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ సీఎంగా జగనే అవసరం



ఇంటింటికీ వంచన గ్రామ సభలో పాల్గొన్న గొల్లపల్లి సూర్యారావు

సఖినేటిపల్లి: అవినీతికి ఆస్కారం లేని సుపరిపాలనకు, సంక్షేమానికి పెద్ద పీట వేసే పాలనకు రాష్ట్రంలో మళ్లీ ముఖ్యమంత్రిగా వైఎస్ జగనే అవసరం అని రాజోలు వైఎస్సార్ సీపీ ఇన్‌ఛార్జ్ గొల్లపల్లి సూర్యారావు అన్నారు. శనివారం సఖినేటిపల్లి, మోరిపోడు, మోరి, శృంగవరప్పాడు గ్రామాలలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు మట్టపర్తి నాగేంద్రతో కలిసి బాబు ష్యూరిటీ, మోసం గ్యారంటీలో భాగంగా ఇంటింటికీ వంచన పేరుతో చంద్రబాబు మేనిఫెస్టోను గుర్తు చేస్తూ కార్యక్రమం నిర్వహించారు. మండల పార్టీ అధ్యక్షుడు కుసుమ చంద్ర శేఖర్ అధ్యక్షతన జరిగిన గ్రామ స్థాయి సమావేశాల్లో గొల్లపల్లి మాట్లాడుతూ, గత ప్రభుత్వం కన్నా తమ ప్రభుత్వం రెట్టింపు మేలు చేకూరుస్తుందంటూ సూపర్ సిక్స్ హామీలు ఊదరగొట్టిన చంద్రబాబు, అధికారంలోకి వచ్చాక మాటమార్చడాన్ని ధ్వజమెత్తారు. గతంలో జగన్ చేసిన పాలన, ప్రస్తుత కూటమి చేస్తున్న పాలనను బేరీజు వేసుకోవాలన్నారు. పరిశీలకుడు నాగేంద్ర మాట్లాడుతూ, మళ్లీ జగన్‌ను గెలిపిస్తేనే పేదల సంక్షేమ పథకాలు వెల్లివిరుస్తాయని పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రుద్రరాజు చినరాజా, రాష్ట్ర బీసీ నేత శివకుమార్, జిల్లా ఉపాధ్యక్షుడు ఈద రవిరెడ్డి, పార్టీ యువజన ప్రతినిధి కటకంశెట్టి ఆదిత్య, విద్యార్థి విభాగం ప్రతినిధి సహదేవ్, సర్పంచ్‌లు రావి నాగ వెంకట లక్ష్మీదేవి, పసలపూడి లక్ష్మీ పద్మ మంగతాయారు, ఎంపీటీసీలు జాన లక్ష్మీ దుర్గ సూర్యావతి, రాపాక దీవెన కుమారి, గ్రామ శాఖల కమిటీ నాయకులు నల్లి ప్రేమానందం, గెడ్డం శుభాకర్, బళ్ల వీర్రాజు, భైరవశెట్టి శివ, గెడ్డం సూర్యారావు, మద్దాల కృష్ణమూర్తి, పార్టీ కేడర్ ముప్పర్తి త్రిమూర్తులు, రుద్రరాజు రంగరాజు పాల్గొన్నారు.

శాంతి భద్రతలకు విఘాతం కలిగించొద్దు

రాజోలు: శాంతి భద్రతలకు విఘాతం కలిగించవద్దని రాజోలు సీఐ నరేష్‌కుమార్ సినీ హీరోల అభిమాన సంఘాలు, మెకానిక్ సంఘాల నాయకులతో శనివారం సమావేశం నిర్వహించారు. రాజోలు నియోజకవర్గంలో కొత్త సినిమాలు రిలీజ్, అభిమాన హీరోల పుట్టినరోజులు, బెనిఫిట్ షోల సమయంలో బైక్ సైలెన్సర్లు తీసేసి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారన్నారు. శాంతియుతంగా వేడుకలు నిర్వహించుకునేలా సినీ హీరోల అభిమాన సంఘాల ప్రతినిధులు సహకరించాలన్నారు. అలాగే బైక్ మెకానిక్ సంఘాల నాయకులకు సూచనలు చేశారు.పోలీస్ నిబంధనలు పాటించకపోతే కేసులు నమోదు చేస్తామన్నారు.

అప్పనపల్లి ఆలయానికి పోటెత్తిన భక్తులు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి ఆలయానికి శనివారం భక్తులు పోటెత్తారు. గోవిందా.. గోవిందా అంటూ భక్తులు ఆ దేవదేవుడిని దర్శించుకుని తన్మయత్వం చెందారు. ప్రాతఃకాలంలో సుప్రభాత సేవ, తొలి హారతితో దర్శనాలు ప్రారంభమయ్యాయి. స్వామి వారికి వివిధ సేవల ద్వారా రూ.4.65 లక్షలు ఆదాయం వచ్చిందని ఆలయ ఈఓ సత్యనారాయణ తెలిపారు. శాశ్వత నిత్యఅన్నదానం ట్రస్టుకు భక్తులు రూ.1.12 లక్షలు విరాళాలుగా అందించారన్నారు. ఐదు వేల మంది భక్తులు స్వామి వారిని దర్శించుకున్నారని, 2,800 మంది స్వామి వారి అన్న ప్రసాదం స్వీకరించారన్నారు.


దాతల విరాళాలు

స్వామి వారి నిత్య అన్నదానం ట్రస్టుకు పలువురు విరాళాలు అందించారు. హైదరాబాద్‌కు చెందిన స్వయంపాకుల మోహన మురళిబాబు, సూర్య కుమారి దంపతులు రూ.50 వేలు విరాళంగా అందించారు. రాజమహేంద్రవరానికి చెందిన రంప దేవీ ప్రియాంక వారి కుటుంబీకులు రూ.52,700 విరాళంగా ఇచ్చారు.

పవర్ లిఫ్టింగ్ పోటీల్లో ప్రతిభ

పి.గన్నవరం: రాజమహేంద్రవరం భారతీయ వ్యాయామ శాలలో జరిగిన పవర్ లిఫ్టింగ్ పోటీల్లో పోతవరంలోని ఎస్ఎస్ ఫిట్‌నెస్ జోన్‌కు చెందిన యువకులు ప్రతిభ కనబరిచారు. 53 కిలోల కేటగిరిలో వీరబాబు బంగారు పతకం, భాను ప్రకాష్ కాంస్య పతకం, 73 కిలోల విభాగంలో శివ బంగారు పతకం, 83 కిలోల విభాగంలో ఆదినారాయణ వెండి పతకం, 93 కిలోల విభాగంలో సత్యం బంగారు పతకం సాధించినట్టు ఫిట్‌నెస్ జోన్ నిర్వాహకులు తెలిపారు.

గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా



మామిడికుదురులో కృష్ణుడు, గోపికల వేషధారణలో విద్యార్థులు



కృష్ణుని విగ్రహాన్ని ఎడ్ల బండిపై ఊరేగిస్తున్న దృశ్యం

అంబాజీపేట: కృష్ణాష్టమి వేడుకలను అంబాజీపేట, మాచవరం, నందంపూడి గ్రామాల్లో శనివారం నిర్వహించారు. మాచవరం దొమ్మేటివారిపాలెంలో శ్రీకృష్ణ శెట్టిబలిజ అభ్యుదయ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో కృష్ణుడికి అర్చకులు ఫణి ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం యువకుల కేరింతల నడుమ ఉట్టికొట్టారు. అంబాజీపేట పెద్ద వీధి రామాలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా నిర్వహించారు.

రాజోలు: కృష్ణాష్టమి వేడుకలను రాజోలు గోశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో గోశాల ఆవరణలో ఏర్పాటు చేసిన ఉట్టి కొట్టే కార్యక్రమంలో ఉత్సాహంగా పాల్గొన్నారు. గ్రామానికి చెందిన మొల్లేటి వల్లీశ్వర్ ఉట్టిని కొట్టి బహుమతిని సాధించాడు. కృష్ణుడి వేషధారణలో చిన్నారులు తృతీయ బహుమతులు పొందారు. గోశాల అధ్యక్షుడు దార్ల పెదబాబు, కార్యదర్శి అక్కిరెడ్డి సుబ్రహ్మణ్యం, కోశాధికారి రేకపల్లి నాగబాబు, రోటరీ అధ్యక్షుడు సోమిశెట్టి అంజనేయులు, గోపూజ కన్వీనర్ రాజా నాగ రత్నకుమార్, ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కాసు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొత్తపేట: శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా ఆత్రేయపురం మండలం ర్యాలి గణపతి ఆలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలు నిర్వహించారు. అనూస్ స్వచ్ఛంద సేవా సంస్థ, మ్యాజిక్ హౌస్ నిర్వహకుడు చింతా శ్యామ్‌కుమార్, అన్నపూర్ణ ఆధ్వర్యంలో చిన్నారుల కృష్ణుడు, గోపికల వేషధారణ పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో చిన్నారులు విశేషంగా ఆకట్టుకున్నారు. ముందుగా చిన్నారులు గ్రామంలో కృష్ణ సంకీర్తన చేసుకుంటూ ఉట్టిని కొట్టారు. అనంతరం వేషధారణలో ప్రతిభ కనబరచిన చిన్నారులకు బహుమతులు, సర్టిఫికెట్స్ అందజేశారు. గోకుల కృష్ణా.. గోపాల కృష్ణా అంటూ ప్రజలు కృష్ణాష్టమి వేడుకలు శనివారం వాడవాడలా ఘనంగా జరుపుకున్నారు. వైష్ణవ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు ఆయా ఆలయాలకు వెళ్లి స్వామివార్లను దర్శించుకున్నారు. పలు సంస్థలు, పాఠశాలల్లో చిన్నారుల నుంచి పెద్దల వరకూ వేడుకలు జరుపుకున్నారు. పలు పాఠశాలల్లో బాలలు శ్రీకృష్ణుడు– గోపికల వేషధారణలతో అలరించారు. గ్రామాల్లో రాత్రి ఉట్టి కొట్టే కార్యక్రమాలు, ఉత్సవాలు నిర్వహించారు.

సఖినేటిపల్లి: అంతర్వేది లక్ష్మీనరసింహస్వామి ఆలయానికి శనివారం భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. ప్రత్యేక క్యూలైన్ల ద్వారా భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. నిత్యం నిర్వహించే నారసింహ సుదర్శన హోమంలో పాల్గొని స్వామిని భక్తి శ్రద్ధలతో కొలిచారు. కాగా, నిత్యాన్నదాన పథకంలో 5 వేల మంది భక్తులు స్వామివారి ప్రసాదాన్ని తీసుకున్నట్టు అసిస్టెంట్ కమిషనర్ ప్రసాద్ తెలిపారు. అలాగే లడ్డు ప్రసాదం విక్రయాలు, ప్రత్యేక దర్శన టికెట్ల అమ్మకాల ద్వారా రూ.1,56,041, అన్నదాన ట్రస్టుకు విరాళాలు ద్వారా రూ.1,80,591 ఆదాయం వచ్చినట్టు ఏసీ ప్రసాద్ పేర్కొన్నారు.

సఖినేటిపల్లి: మండలంలోని అంతర్వేదిపాలెంలో శనివారం శ్రీకృష్ణ జన్మాష్టమి సందర్భంగా స్థానికులు ఉట్టికొట్టే కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. శ్రీమదన గోపాల్ యాదవ్ సంఘం, యూత్ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం ఏర్పాటు చేశారు. తొలుత కృష్ణుని చిత్రపటం వద్ద సంఘ పెద్దలు, మహిళలు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆనందోత్సవాలు మధ్య ఉట్టికొట్టారు. ఎంపీటీసీ మందపాటి రత్నం, మందపాటి సత్యనారాయణ, నాగేశ్వరరావు, సుబ్బారావు, సూర్య నారాయణ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

20న శాంతి కల్యాణం

అంతర్వేది ఆలయంలో ఈనెల 20న బహుళ ద్వాదశి తిధి నాడు ఆర్జిత సేవగా స్వామివారి శాంతి కల్యాణం నిర్వహిస్తున్నట్టు ఏసీ ప్రసాద్ అన్నారు. కల్యాణం టికెట్టు ముందస్తు బుకింగ్ టెంపుల్ వెబ్‌సైట్‌లో, ఆలయం వద్ద ఉన్న కౌంటర్‌లో భక్తులు పొందవచ్చనని చెప్పారు.

మలికిపురం: గొల్లపాలెంలో కృష్ణాష్టమి వేడుకలు ఘనంగా జరిగాయి. బాలబాలికలు గ్రామ పురవీధులు గుండా ఉట్టి పట్టుకుని తిరిగి అనంతరం ఉట్టి కొట్టారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ గుండుమేను నారాయణమూర్తి. కందుల విజయ్ కుమార్, గుండు మేను శ్రీను, కమిటీ సభ్యులు పాల్గొన్నారు. విజేతకు స్వర్గీయ కందుల తాతారావు, మాగాపు చైతన్య జ్ఞాపకార్థం బహుమతి ప్రదానం చేశారు.

మామిడికుదురు: కృష్ణాష్టమి వేడుకలు శనివారం కోలాహలంగా జరిగాయి. కృష్ణుడు, గోపికల వేషధారణలో చిన్నారులు ఆకట్టుకున్నారు. చిన్ని కన్నయ్యలు ఉట్టి కొట్టే కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. అప్పనపల్లి పాత గుడి వద్ద యాదవ సంఘం ఆధ్వర్యంలో వేడుకలను వైభవంగా జరిపించారు. రెండు ప్రాంతాల్లో శ్రీకృష్ణుడికి భారీగా ప్రసాదాలను నైవేద్యంగా చెల్లించారు. గోపూజ, ఉట్టి కొట్టే కార్యక్రమాలతో పాటు గ్రామంలో భారీ ఊరేగింపు నిర్వహించారు.

పి.గన్నవరం: స్థానిక పట్టాభి రామాలయం వద్ద కృష్ణాష్టమి వేడుకలను గరుడ వేగా టీమ్, రామసేతు భక్త బృందం ఆధ్వర్యంలో శనివారం నిర్వహించారు. దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన కళాకారులు, భక్త బృందాలు పాల్గొని వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించడంతో గ్రామంలో ఆధ్యాత్మిక సందడి నెలకొంది. ఉదయం శ్రీకృష్ణ జన్మస్థల పూజ, ఎడ్ల బండిలో స్వామి వారి ఊరేగింపు, జలాభిషేకం తదితర కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం పుర వీధుల్లో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, స్వామి వారి ఉత్సవ విగ్రహాలతో గ్రామోత్సవం జరిగింది. అనంతరం గోదావరి హారతి కార్యక్రమం నిర్వహించారు.

నేతల మృతి తీరనిలోటు



సంధిపూడిలో చిన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న జగ్గిరెడ్డి

ఆలమూరు: మండలంలోని సంధిపూడి, మూలస్థాన అగ్రహారం గ్రామాల్లో పార్టీ అభ్యున్నతికి అంకిత భావంలో పనిచేసిన నేతలు పోలాభత్తుల రాంబాబు (చిన్న), తోరాటి చక్రవర్తిని కోల్పోయామని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే చిర్ల జగ్గిరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. సంధిపూడిలో శనివారం జరిగిన దశదినకర్మలో జగ్గిరెడ్డి స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి పాల్గొన్నారు. అనంతరం కుటుంబసభ్యులను పరామర్శించి అన్ని విధాలుగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. మృతుడి చిన్న చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే మూలస్థాన అగ్రహారంలో అనారోగ్యంతో మృతి చెందిన పార్టీ సీనియర్ నేత చక్రవర్తి నివాసానికి వెళ్లి కుటుంబాన్ని పరామర్శించారు. వైఎస్సార్ సీపీ నాయకులు మోటుపల్లి వెంకన్న, నాంద్ర నాగమోహన్ రెడ్డి, గోవిందు, తోట కొండయ్య పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడి న్యాయం చేస్తాం

మామిడికుదురు: ఓయన్‌జీసీ అధికారులతో మాట్లాడి అందరికీ న్యాయం చేస్తామని రాజోలు ఎమ్మెల్యే దేవ వరప్రసాద్ తెలిపారు. కరవాక గ్రామంలో శనివారం ఏర్పాటు చేసిన గ్రామసభలో ఓయన్‌జీసీ ద్వారా మంజూరైన నిధుల వినియోగంపై సమీక్షించారు. 2018–2019లో ఓయన్‌జీసీ నుంచి రూ.76 లక్షలు నిధులొచ్చాయి. అప్పట్లో వివాదాల కారణంగా నిధుల పంపిణీ జరగలేదు. తాము ఇచ్చిన నిధులను తిరిగి ఇచ్చేయాలని ఓయన్‌జీసీ నుంచి ఒత్తిడి రావడంతో ఆ నిధులను ఏ విధంగా వినియోగించాలన్న అంశంపై ఎమ్మెల్యే గ్రామసభ ఏర్పాటు చేసి గ్రామస్తుల అభిప్రాయాలు తీసుకున్నారు. దీనిపై ఓయన్‌జీసీ అధికారులతో చర్చించి ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు.

గౌతు లచ్చన్నకు నివాళి

కొత్తపేట: స్వాతంత్ర్య సమరయోధుడిగా దేశం కోసం, బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతి, ఐక్యతకు ఎంతగానో పాటుపడిన మహనీయుడు గౌతు లచ్చన్న అని మండల శెట్టిబలిజ సంఘం నాయకులు అన్నారు. శనివారం గౌతు లచ్చన్న జయంతి పురస్కరించుకుని స్థానిక ఆర్ఎస్ కన్వెన్షన్ హాలు వద్ద ఆయన విగ్రహానికి పలువురు బీసీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ, గౌడ, శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన, యాత కులస్తులు అందరినీ ఒకే తాటిపై నడిపించేందుకు లచ్చన్న ఎంతో కృషి చేశారన్నారు. జెడ్పీటీసీ మాజీ సభ్యుడు రెడ్డి రామకృష్ణ, మండల శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి సత్తిపండు, కోశాధికారి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

మందపల్లి క్షేత్రంలో తైలాభిషేకాలు

కొత్తపేట: శనిదోష నివారణకు ప్రసిద్ధి చెందిన మండల పరిధిలోని మందపల్లిలో ఉమా మందేశ్వర స్వామిని భక్తులు దర్శించుకున్నారు. శనివారం స్వామిని అధిక సంఖ్యలో భక్తులు దర్శించి ప్రత్యేక పూజలు, తైలాభిషేకాలు నిర్వహించారు. దేవస్థానం ఈఓ దారపురెడ్డి సురేష్‌బాబు ఆధ్వర్యంలో సిబ్బంది భక్తుల సౌకర్యాలను పర్యవేక్షించారు. టిక్కెట్లు, వివిధ సేవల ద్వారా రూ.1.57 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. అలాగే అన్న ప్రసాద పథకానికి పలువురు భక్తుల ద్వారా విరాళాల రూపంలో మరో రూ.33,695 రాగా మొత్తం రూ.1,91,581 ఆదాయం వచ్చినట్టు తెలిపారు.

నిత్యాన్నదాన పథకానికి విరాళం

అయినవిల్లి: విఘ్నేశ్వర స్వామి ఆలయంలో అమలు చేస్తున్న నిత్యాన్నదాన పథకానికి ధవలేశ్వరానికి చెందిన అనిల్ కుమార్, నౌదూరి నియాన్ కార్తికేయ, దేవపు హర్షిత్ విఘ్నేష్ రూ.20, 232, హైదరాబాద్‌కు చెందిన పేరి కృష్ణ కౌశిక, లావణ్య దంపతులు రూ.10,116లు శనివారం అందజేశారు. దాతలు ఈ సొమ్మును ఆలయ ప్రధానార్చకులు మాచరి వినాయకరావుకు అందజేశారు. దాతలను వేదమంత్రాలతో సత్కరించి స్వామి చిత్రపటం, ప్రసాదం అందజేశారు.

మృతుడి కుటుంబానికి చేయూత

సఖినేటిపల్లి: మండలంలోని పల్లిపాలెంలో మృతుడి కుటుంబానికి జిల్లా రవాణాధికారి దేవిశెట్టి శ్రీనివాసరావు శనివారం చేయూత నిచ్చారు. ఈ మేరకు మృతుడి ఇంటికెళ్లి కుటుంబీకులను ఆయన పరామర్శించారు. పీ–4 స్ఫూర్తితో ఇప్పటికే దత్తత తీసుకున్న మృతుడు దుర్గాప్రసాద్ కుటుంబానికి అండగా నిలిచి, తల్లికి నిత్యావసరాలు అందజేశారు. అన్ని విధాలా ఆదుకుంటామని భరోసా ఇచ్చారు.

జూదరుల అరెస్ట్

ఆలమూరు: మండలంలోని జొన్నాడలో పేకాట నిర్వహిస్తున్నారనే సమాచారంతో ఆలమూరు పోలీసులు జరిపిన దాడిలో నలుగురు జూదరులను అరెస్ట్ చేశారు. ఎస్సై నరేష్ కథనం ప్రకారం.. తారకరామ కాలనీ శివార్లలో పేకాట ఆడుతున్నారన్న సమాచారంతో శుక్రవారం రాత్రి ఎస్సై నరేష్ నేతృత్వంలో పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురిని అదుపులోకి తీసుకొని వారి నుంచి రూ.2,700 స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

ఆలమూరు: జిల్లాలో అత్యంత ప్రమాదకరమైన కొత్తూరు– వెదురుమూడి రోడ్డు మళ్లీ ఓ యువకుడి ప్రాణాన్ని బలి తీసుకుంది. వివాహం జరిగి ఏడాది అవ్వకుండానే మృత్యువాత పడ్డాడు. ఎస్సై నరేష్ కథనం ప్రకారం.. అచ్యుతాపురానికి చెందిన వల్లూరి సాయి నిరంజన్ (26)కు గతేడాది ఆగస్టు 23న వివాహమైంది. హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పని చేస్తున్న అతడు శనివారం ఉదయం తణుకులోని అత్తారింటికి వెళ్లి వస్తుండగా స్థానిక జొరిచెట్ల సమీపంలో ఉన్న కోళ్ల ఫారం వద్ద వేగంగా వచ్చిన లారీ బైక్‌ను ఢీకొంది. తీవ్ర గాయాలైన అతడిని స్థానికులు రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గమధ్యలో మృతి చెందాడు. ఎస్సై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.